

# అక్కడే ఆగక

- మల్లాది వెంకట కృష్ణమూర్తి

(గత సంచిక తరువాయి)

"ఈరీ స్టోరీ" చైత్ర చెప్పింది.

"ఆ భార్యాభర్తలదో విషాద కథ. భార్య జీతం భర్త జీతంకన్నా ఎక్కువ."

"ఉపయోగించిన టీ బేగ్‌ని దొంగిలించమని ఆ దొంగని అతను అడిగాడు.

"అందుకు లక్షరూపాయలు చెల్లించాడు."

"ఈ రెండు వాక్యాల మధ్య పెద్ద కథ రాయచ్చు. ఆ టీ బేగ్ ద్వారా డైమండ్స్ స్మగులవచ్చు. లేదా విషప్రయోగానికి సాక్ష్యంగా కోరి ఉండచ్చు" చైత్ర చెప్పింది.

తనతో అతను రతి జరిపాక ఆమె సంతృప్తిగా చెప్పింది.

"నేను మరణించినప్పటినించి ఇంత గొప్ప రతి సుఖం నాకు లభించలేదంటే నమ్ము."

"వాడు గుండాగి చచ్చుంటాడు" ఆద్య పగలబడి నవ్వింది.

"అమెరికాలో ఒకే క్షణంలో బీఫ్ బర్గర్ని పన్నెండున్నర లక్షలమంది తిన్నారు.

"అదే సమయంలో ఇండియాలో ఆకలితో మాడే ఒకడు ఆవు మాంసం తిన్నందుకు వాడ్ని చంపారు"ఇలాంటి వార్తలు త్వరగా గుర్తుంటాయి" ఇలియా చెప్పింది.

ఇలియా బ్లినీ పేన్‌కేక్‌లలో రోజ్‌మెరీ, థైమ్ హెర్బ్స్‌తో చేసిన చికెన్ కర్రీని రోల్ చేసింది. బ్రెడ్ ఆంలెట్ టోస్ట్‌ని, ఘానా జాతీయ వంటకం రెడ్ రెడ్‌ని కూడా చేసింది.

"ఇది ఘానా ప్రజల్ స్టేపిల్ ఫుడ్. మనకి రైస్ ఎలాగో వీరికి ఇది అలా. ఈ స్ట్యూకి పొగచూరి ఆ రుచి ఉండేలా చేస్తారు. బ్లాక్ ఐడ్ బీన్స్, టొమేటో, మాంసం, ఎర్ర పామాయిల్‌ని కలిపి చేస్తారు. రోడ్లమీద, ఆఫీసుల్లో, ఇళ్ళల్లో దీన్ని ఎక్కువగా తింటారు. ఘానాలో బ్రేక్‌ఫాస్ట్‌కి ఇది తప్పనిసరి" చైత్ర చెల్లెలికి చెప్పింది.

"ఆద్యా. దయచేసి పెప్పర్ ఇస్తావా?" అలెక్సీ అడిగాడు.

ఆమె దాన్ని మాత్రమే ఇస్తూంటే చైత్ర చటుక్కున సాల్ట్ షేకర్ని కూడా చెల్లెలి చేతిలో ఉంచింది. ఆద్య రెంటినీ ఇచ్చింది.

"మీరు మాస్కోలో పుట్టారా?" ఆద్య అడిగింది.

"కాదు. లెనిన్ గ్రాడ్‌లో. ఇప్పుడు దాని పేరు సెయింట్ పీటర్స్‌బెర్గ్. రెండో ప్రపంచ యుద్ధకాలంలో జర్మన్స్ మా నగరాన్ని స్థంభించారు. అందులో మా అంకుల్ సైనికుడిగా పనిచేసారు. "

"యుద్ధంలో మీ అంకుల్ ఎవర్నైనా చంపారా?" ఆద్య ఆసక్తిగా అడిగింది.

"చాలామందిని చంపే ఉంటారు. ఆయన మిలటరీ కుక్‌గా పనిచేసేవారు."

ఆద్య ఫక్కున నవ్వింది. భోజనం ముందు అలెక్సీ చెప్పింది ఆయన పిల్లలు ఇద్దరూ తిరిగి చెప్పడం గమనించిన చైత్ర నవ్వుతూ అడిగింది.

"నీకు భోజనం ముందు మాత్రమే దేవుడు ఉంటాడన్నమాట."

"దేవుడా? అదెవరు? నేను దేవుడ్ని ప్రార్ధించాననుకుంటే పప్పులో కాలేసావు 'భోజనం విలువైంది, దీన్ని వృధా చేయకూడదు అని మాత్రమే చెప్పాను."

"ఓ! ఎందుకలా?" ఆద్య అడిగింది.

"మనుషుల విషాదానికి అనేక ముఖాలున్నాయి. రెండో ప్రపంచ యుద్ధంకాలంలో మా లెనిన్ గ్రాడ్ విషాదం గురించి ప్రపంచానికి తెలీదు. ఆపరేషన్ బార్బరోసా.."

"భోజనం తర్వాత. భోజనం దగ్గర కాదు" ఇలియా అడ్డుపడి బర్తని మందలించింది.

"నువ్వు దేవుడ్ని నమ్మవా?" ఆద్య అడిగింది.

"నువ్వు?"

"ఒకప్పుడు నమ్మేదాన్ని. కొన్ని రోజులుగా అది పోయింది."

"నువ్వే చెప్పు. మనిషికి మతం, దేవుడి అవసరం ఏమిటి? యూదులు గోడవైపు తిరిగి ప్రార్ధిస్తారు. హిందువులు అలంకరించిన వినాయకుడ్ని ప్రార్ధిస్తారు. జొరాస్ట్రియన్స్ అగ్నిని ప్రార్ధిస్తారు. మొరోన్స్ ప్రకృతిని ఆరాధిస్తారు. కాని వీరిలో ఎవరూ తాము దేవుడ్ని చూసామని ఇంతదాకా చెప్పలేదు. 'దేవుడు నాకో ఆవుని ఇచ్చాడు. నా ఇంటి కప్పుని మరమ్మత్తు చేసాడు. నాకో కారుని ఇచ్చాడు. నా ధాన్యం కొట్టంలోకి ఎలుకలు రాకుండా చేసాడు ' అన్నవారే లేరు. ఓ ఆవగింజని కూడా దేవుడు ఏ మనిషికీ ఇవ్వలేదు. దేవుడు చెవిటివాడై ఉండాలి. ఎన్నిసార్లు చెవిటివాడికి విన్నవించినా ఎంతో ఆయనకి విన్నవించినా అంతే. అది జరగదు. నాకు మతమంటే ఎందుకు ద్వేషమంటే, ప్రపంచంలో అన్ని యుద్ధాలకన్నా మత యుద్ధాలవల్ల ఎక్కువమంది మరణించారు" అలెక్సీ చెప్పాడు.

"సౌండ్ రీజనబుల్. డజంట్ ఇట్?" చైత్ర ఇలియాని అడిగింది.

"అన్నీ నచ్చచెబుతాడు" ఆమెచిరుకోపంగా చెప్పింది.

"ఎవరూ పుట్టించకుండా అసలు మనిషెలా పుట్టాడంటావు?" చైత్ర అడిగింది.

"మనిషి ఆవిర్భావానికి అనేక వందల థియరీలని చెప్పారు. ఏడం అండ్ ఈవ్, మనువు.. ఇవన్నీ ఊహాజనిత థియరీలు. ఓ బ్రెడ్ ముక్కని గాలాడని డబ్బాలో ఉంచి వారం తర్వాత మూత తీసి చూడు. నీకు పురుగులు కనిపిస్తాయి. పాచి, కుళ్ళిన పదార్థం నించి జీవి ఆవిర్భవించింది. మరో వారం తర్వాత చూస్తే పెరిగిన ఆ పురుగుల సంతతి కనిపిస్తుంది. మనిషి కూడా అలాగే పదార్థం నించి పుట్టాడు. కాని ఆ పదార్థం వేరేది. విశ్వంలో ఆ పదార్థం ఏర్పడడానికి కోట్ల సంవత్సరాలు పట్టింది. దాన్నించి ముందుగా చెట్ల జాతులు, తర్వాత జంతు జాతులు పుట్టాయి. క్రమంగా జంతువుల్లోని మెదడు అభివృద్ధి జరిగి, జ్ఞాపకశక్తి పెరగడంతో ఆ జంతువు పరిస్థితులకి అనుగుణంగా తనని మలచుకునే మనిషిగా ఉద్భవించాడు. మనిషి ఆవిర్భావానికి మీకు ఏ థియరీ నచ్చుతుందో దాన్ని ప్రచారం చేయకండి. ఎందుకంటే ఎవరి అభిమాన థియరీ వారికి ఉంటుంది. దేవుడు కల్లో కనపడి తనకి గుడి కట్టమని అడుగుతాడు తప్ప బడి కట్టించమని అడగడు కదా. మనిషికి నన్నడిగితే పుణ్యం కాదు. నైపుణ్యం కావాలి. భక్తికన్నా భుక్తి అవసరం. దేవాలయం కాదు. శౌచాలయం ముఖ్యం. దేవాలయంలో అంతా తృప్తి చెందుతారో లేదో కాని శౌచాలయంలోంచి తృప్తిగా రానివాడే ఉండడు."

అంతా ఫక్కున నవ్వారు.

"హుండీలని దేవాలయంలో బదులు విద్యాలయం, వైద్యాలయంలో పెట్టాలి. అవయవాలని కాపాడుకోవాలి. మెదడుని వాడుకోవాలి. భక్తులకి నా సలహా. దేవుడ్ని నమ్ము. కాని నీ సైకిల్‌కి తాళం వేస్తూండు.

ఆద్య నవ్వింది.

"నువ్వు వండినవన్నీ రెస్టరెంట్ క్వాలిటీ ఫుడ్స్" చైత్ర భోజనం తిన్నాక ఇలియాని అభినందిస్తూ చెప్పింది.

"అలా అంటే మీకు బిల్ ఇవ్వగలదు. జాగ్రత్త!" అలెక్సీ నవ్వుతూ హెచ్చరించాడు.

"నీకు ఊరికే రష్యన్ జోకర్ అనే పేరు పెట్టలేదు" చైత్ర చెప్పింది.

"నీ భార్యని నీ ప్రయారిటీగా, నీ భార్య నిన్ను తన ఆప్షన్‌గా చూసేలా ప్రవర్తించడమే మంచి వంటకి, మంచి దాంపత్యానికి పునాది" అలెక్సీ చెప్పాడు.

"మా అమ్మాయి కేలీ ఫ్లవర్ తినదు. తినిపించడానికి దాని పేరు కేలీ'పవర్' అని, అది తింటే బలం బాగా వస్తుందని ఏంజీని మభ్యపెట్టాను. ఇప్పుడు మా అబ్బాయి కూడా దాన్ని ఇష్టంగా తింటున్నాడు" ఇలియా నవ్వుతూ చెప్పింది.

"పిల్లలకి బ్రాక్లి ఇష్టం ఉండదు. వారిని 'బ్రాక్లీ తింటావా?' అని అడక్కూడదు.

'రెండు బ్రాక్లీలు తింటావా? లేక ఐదా?' అని అడగాలి. ఈ ఆప్షన్ వల్ల వాళ్ళు తమకి నచ్చనిది తక్కువ ఎంపిక చేసుకునే అవకాశం ఉండటంతో, ఒక్కటి తినమని కోరినా తిననివారు 'రెండు' అని జవాబు చెపుతారు. ఇది వర్కర్స్ దగ్గర మేనేజ్‌మెంట్ టెక్నిక్‌గా కూడా వాడతాను" అలెక్సీ చెప్పాడు.

భోజనాలయ్యాక చైత్ర తన ప్లేట్‌ని సింక్ దగ్గరకి తీసుకెళ్ళడం గమనించి ఆద్య కూడా అదే పనిచేసింది. చైత్ర ఇద్దరి ప్లేట్లతో పాటు కొన్ని గిన్నెలని కూడా శుభ్రంగా బ్రష్‌తో కడిగి వాటిని డిష్ వాషర్లో ఉంచి చేతులు తుడుచుకుని తగ్గుస్వరంతో చెప్పింది.

"మన అతిథులకి పని భారం తగ్గించడం వెస్ట్రన్ సంప్రదాయం. ఇది తెలీక ఓసారి బల్ల ముందునించి లేచివెళ్తూంటే దాన్ని తోమి వాష్ బేసిన్‌లో ఉంచమని నా అమెరికన్ హోస్ట్ చెప్పింది. చాలా అవమానంగా అనిపించింది. వాళ్ళు అన్నిటా నిక్కచ్చిగా ఉంటారని నాకు అప్పటికి తెలీదు. ఆ తర్వాత ఎన్నడూ అలా చెప్పించుకోలేదు."

కిచెన్, డైనింగ్ టేబుల్ సర్దడంలో భర్త తమకి సహాయం చేసాక ఇలియా అక్కచెల్లెళ్ళిద్దరితో నవ్వుతూ చెప్పింది.

"రేపు మీకు పెళ్ళయ్యాక మీ బర్త 'ఐ లవ్ యు' అని తరచు మీకు చెప్పకపోవచ్చు. కాని అతను పక్కబట్టలు మార్చినా, అంట్లు తోమినా, ఇలా మీ పనుల్లో ఏ సహాయం చేసినా వాటిని 'ఐ లవ్ యు'గా స్వీకరించలి. ప్రతీ ప్రేమకి ఎక్స్‌పైరీ డేట్ ఉంటుంది. దాని నాణ్యత పెరిగే కొద్దీ ఎక్స్‌పైరీ డేట్ కూడా పెరుగుతూంటుంది."

ఆద్య అక్కవంక చూసింది. అదే సమయంలో చైత్ర కూడా చెల్లెలివంక చూసింది. తనమీద జినేంద్రకి గల ప్రేమ చాలా తక్కువని, అందుకే దాని డేట్ ఎక్స్‌పైరీ అయిందని ఆద్యకి అనిపించింది.

"రష్యా భాష ఇంగ్లీష్‌లా ప్రపంచ వ్యాప్తం కాదు. దాంతో నల్ల బానిసల వ్యాపారం గురించి ఇక్కడికి వచ్చేదాకా నీకు తెలీనట్లుగా రష్యా చరిత్ర ప్రపంచానికి తెలిదు. రెండో ప్రపంచ యుద్ధంలో హిట్లర్ సైన్యాలు రష్యామీద కూడా దాడి చేసాయి. మా లెనిన్‌గ్రాడ్‌లో ఆయుధ ఫేక్టరీలు చాలా ఉండేవి. కాబట్టి దాన్ని పట్టుకుని రష్యన్ సైనికులకి ఆయుధాలు అందకుండా చేయాలని సైన్యాన్ని పంపాడు. కాని లెనిన్‌గ్రాడ్ పౌరులకి ఆహారం అందకుండా దాన్ని అష్టదిగ్బంధం చేయమని తన సైన్యాన్ని ఆదేశించాడు. జర్మన్ సైన్యం భూభాగాన్ని మూసేసి సహాయం అందకుండా చేసారు. 8 సెప్టెంబర్ 1941 నించి 27 జనవరి 1944దాకా ఆహారం అందకుండా చేశారు. అంటే మొత్తం రెండేళ్ళ నాలుగు నెలల రెండు వారాల ఐదు రోజులు. అంటే ఎనిమిది వందల డెబ్బై రెండు రోజులు అది కొనసాగింది. లోపలకి సరుకు కాని, మనుషులు కాని వెళ్ళకుండా చూసారు. బయటకి మనుషులని పోనియ్యలేదు."

"బాబోయ్!"

"నువ్వు ఇంకోసారి ఆ మాటనేది చెప్తాను. దిగ్బంధం చేసే రోజుకి లెనిన్ గ్రాడ్ జనాభా ఎనిమిది లక్షలపైనే, డోరోగా ఝిన్జ్ని అంటే రోడ్ ఆఫ్ లైఫ్‌గా నాలుగు లక్షలమందిని లేక్ లడోగా మీదుగా నీటి మార్గంలో పడవలమీద

తరలించారు. ఆ నీరు గడ్డకట్టడంతో లారీల మీద తరలించారు. నగరాన్ని వదిలే వారిమీద జర్మన్ సైన్యం ఫిరంగులని పేల్చింది. వారిలో ఏభైవేల మంది చిన్నపిల్లలు. వారిని సైబీరియా, యురల్స్‌లోని చిల్డ్రన్స్ హోంకి పంపారు.

"హిట్లర్ కోరుకున్నట్లుగా క్రమంగా నగరంలో నీరు, ఆహారం కొరత ఏర్పడింది. క్షామం వల్ల ఆహారానికి రేషన్ పెట్టారు. సిటీ రవాణా కుంటుపడటంతో నీరు, బ్రెడ్ కోసం ప్రజలు కొన్ని కిలోమీటర్లు నడిచి పంపిణీ కేంద్రాలకి వెళ్ళి క్యూలో నిలబడి తీసుకోవల్సి వచ్చేది. అదీ నీళ్ళ స్కిల్లీ అనే సూప్, రోజుకి, మనిషికి నూటపాతిక గ్రాముల బ్రెడ్."

"అదేం సరిపోతుంది?"

"పైగా అందులో అరవైశాతం తినడానికి పనికిరాని రంపపు పొట్టుని కలిపేవారు. ఫేక్టరీలో పనిచేసేవారికి రోజుకి ఆరు వందల గ్రాములనించి రెండు వందల గ్రాములకి, చివరకి నూటపాతిక గ్రాముల బ్రెడ్‌ని ఇచ్చారు. ఒక్క నైన్టీన్ ఫార్టీ ఒన్ క్రిస్టమస్‌కి మాత్రం రెండు వందల గ్రాముల బ్రెడ్‌ని ఇచ్చారు. తినదగ్గ మొక్కలని, చెట్లని తిన్నారు. నగరంలోని అన్ని జంతువులని తిన్నారు. చలికాలం చిట్టెలుకలు ఇళ్ళల్లోకి వస్తాయి. వాటిని పట్టుకుని తినసాగారు. ఆకలికి తట్టుకోలేక ప్రజలు మరణించసాగారు. ముందుగా పిల్లలు, వృద్ధులు, అనారోగ్యానికి గురైయేవారు. తర్వాత పెద్దవాళ్ళు. లెనిన్‌గ్రాడ్‌లో చలికాలంలో ఉష్ణోగ్రత మైనస్ ఇరవై డిగ్రీల సెల్సియస్ ఉంటుంది. నీరు లేదు. పవర్ లేదు. ఇంట్లో వేడికి అంటించడానికి కలప లేదు. చాలామంది ఆ చలికి బిగుసుకుని మరణించారు. జనవరి, ఫిబ్రవరి 1942లోనే లక్షలమంది లెనిన్ గ్రాడ్ పౌరులు ఆకలికి మరణించారు. బతికున్నవారు ఒంట్లో మాంసం, కొవ్వు లేకుండా చర్మం కప్పిన అస్థిపంజరాల్లా మారారు."

"అయ్యో!" ఆద్య చెప్పింది.

"హిట్లర్‌కి రష్యన్స్ గురించి తెలీదు. ఐనా వారు జర్మన్స్‌కి లొంగలేదు. ఆ ముట్టడిలో మొత్తం పదిహేను లక్షలమంది మరణించారు. వారిలో జర్మన్ సైనికులు లక్షమంది కేవలం చలికి మరణించారు. మనుషులు రోడ్లమీద మరణించసాగారు. క్రమంగా ప్రజలు శవాలని చూడటానికి అలవాటు పడ్డారు. వారిని సెమెటరీకి తరలించే సెంటర్లకి స్లెడ్జ్ బళ్ళమీద, బేబీ కార్టన్స్‌లో తరలించసాగారు. కొందరు శక్తిలేక వారిని అలాగే నిస్సహాయంగా వదిలేసేవారు. చలికి గడ్డ కట్టుకోవడంతో అవి చెడిపోయేవి కావు. లెనిన్‌గ్రాడ్‌లోని పిస్కర్యోవ్‌స్కోయి సెమెటరీలో ఐదు లక్షలని సమాధి చేసారు."

"అబ్బా!"

ఆద్య మొహంలో విచారం అలుముకుంది.

"మనిషికి జీవించాలనే కాంక్ష ఎంత బలంగా ఉంటుందో లెనిన్‌గ్రాడ్ ముట్టడి నిరూపించింది. ఎవరూ ఆత్మహత్యలు చేసుకోలేదు. ఎలాగైనా  జీవించాలని ప్రయత్నించారు. ప్రతీ మనిషిలోని ప్రాథమిక కోరిక ఇది. రేషన్ కార్డ్‌లకోసం హత్యలు చేసేవారు. కొందరు ఈ శవాలని తినే నరమాంస భక్షకులుగా అయ్యారు."

"ఛ!"

"వారిని పోలీసులు అరెస్ట్ చెయ్యసాగారు. కాని అది అంతటితో ఆగలేదు. మరికొందరు ఎలాగైనా జీవించాలనే కోరికతో బతికున్నవారినే తినసాగారు."

"నిజంగా?"

"అవును."

"దటీజ్ టెరిబుల్!" చైత్ర చెప్పింది.

ఆద్య మొహంలో బాధ, భయం స్పష్టంగా కనిపించాయి.

"మనిషిని మనిషి అనుమానంగా చూసుకోసాగారు. బయట ఆడుకునే పిల్లల్ని ఎత్తుకెళ్ళసాగారు. ఉయ్యాలలోని పిల్లల్ని తల్లులు భద్రంగా చూసుకునేవారు. తమని చంపుతారని ఇంట్లోంచి బయటకి వచ్చిన ప్రజలు అప్రమత్తంగా ఉండేవారు. చాలామంది తమ బంధుమిత్రుల ఇళ్ళకి వెళ్ళడం మానుకున్నారు. చివరికి కుటుంబసభ్యులే ఒకర్ని చూసి మరొకరు భయపడే స్థితికి చేరుకున్నారు. తన అన్నని చంపి ఓ తల్లి తన పిల్లలకి వండి వడ్డించింది. బావమరుదులు, మరదళ్ళు.. ఎవరు దొరికితే వారిని. ముఖ్యంగా వీరిలోని అరవై శాతంమంది ఏ మద్దతూ లేని బీద మహిళలే. ఓ తల్లి తన ఆఖరి బిడ్డని చంపి వారు జీవించడానికి ముగ్గురు పిల్లలకి పెట్టింది."

"అది తల్లికాదు. రాక్షసి" ఆద్య చెప్పింది.

"తల్లే. ఆకలితో నలుగురు పిల్లలు మరణించేకంటే ఒకరు మరణించి, ముగ్గురు జీవించాలని ఆ తల్లి మనసు అనుకుంది. తన స్వంత ముద్దుల బిడ్డని చంపినప్పుడు ఆ తల్లి మనసు ఎంత బాధపడి ఉంటుందో, తనకి సంప్రాప్తించిన ఆ దీనస్థితికి ఎంత కుమిలిపోయి ఉంటుందో నేను అర్థం చేసుకోగలను" ఇలియా చెప్పింది.

"మరో సందర్భంలో ఓ సందులో బలంగా, లావుగా కొవ్వుపట్టిన ఓ మహిళని చూసిన అస్థిపంజరాల్లా ఉన్న కొందరు మీదపడి ఆమెని చంపలేదు కాని కొరుక్కుతిన్నారు."

వెంటనే ఆద్య రెండు చెవులనీ మూసుకుంది.

"ఆమె బేకరీలో పనిచేసేది. మరికొందరు ఆమెని తిన్నారు. ఇంకొందరు. ఆ తర్వాత మరికొందరు. మరణించిన ఆమె గురించి పోలీసులకి తెలిసింది కాని నిందితుల ఆచూకీ తెలీలేదు.ఎవరూ తోటివాళ్ళని పట్టించరు కదా. కొందరు అమాయకులని వారు అరెస్ట్ చేసారు. మొత్తం రెండువేల ఒక్క వందకి పైగా నరమాంస భక్షకులని పోలీసులు ఆ సమయంలో అరెస్ట్ చేసారు. పోలీసులు వారిని రెండు రకాలుగా విభజించారు. ట్రుపోయెడ్స్టో. వీరు మరణించిన వారినే తినేవారు. వీళ్ళని జైలుకి పంపేవారు. ల్రుడో యెడ్స్టోవోలు చంపి తినేవారు. నరమాంస భక్షణ అప్పట్లో రష్యాలో చట్టరీత్యా శిక్షపడే నేరం కాదు. ల్రుడో యెడ్స్టోవోలని పోలీసులు కాల్చి చంపేసేవారు. ఒక్క ఏప్రిల్ 1942లోనే పోలీసులు అలాంటి

మూడు వందలమందిని అరెస్ట్ చేసారు. అలాంటివారు పన్నెండువందలకి పైగా ఆధారాలతో దొరికారు. వారంతా చదువులేని బీదలే. వారు గతంలో ఎలాంటి నేరం చేసినవారు కారు. చెప్పాగా."

"మనిషికి జీవించాలనే కాంక్ష ఎంత బలంగా ఉంటుందో నాకు అర్థమైంది" ఆద్య చెప్పింది.

కొద్దిసేపు అలక్సీ నిశ్శబ్దంగా ఉండిపోయాడు. ఆద్య మనసులో అనేకరకాల ఆలోచనలు సుళ్ళు తిరుగుతున్నాయి.

"జర్మన్ సైనికులకి ఆహారం ఉన్నా వారు అక్కడి చలికి తట్టుకోలేకపోయారు. లక్షమంది జర్మన్ సైనికులు చలికి గడ్డకట్టుకుని మరణించారు. ట్వంటి సెవెంత్ జనవరి నైన్టీన్ ఫార్టీనైన్. అది లెనిన్‌గ్రాడ్ నగర చరిత్రలో సువర్ణాక్షరాల్లో రాయదగ్గ తారీకు. ఆ రోజు సోవియెట్ సైన్యం లెనిన్‌గ్రాడ్ నగరంలోకి ప్రవేశించడంతో ఆ పీడకల పూర్తయింది. ఈ పీడకల పదిహేను లక్షలమంది మరణాన్ని చవిచూసింది. తొంభైవేల మంది జర్మన్ సైనికులు యుద్ధఖైదీలుగా చిక్కారు. వారిలోని ఆరువేలమందే జర్మనీకి తిరిగి వెళ్ళారు. నేడు వారిలోని ఒక్కరూ జీవించిలేరు. ఆఖరి సైనికుడు నైన్టీన్ ఎయిటీనైన్‌లో మరణించాడు."

"ఆనాటి ప్రజల డైరీలని సేకరించి సైకాలజిస్ట్‌లు చదివారు. వారు వాటిని తమకోసం తప్ప ఎవరైనా చదువుతారని రాసుకోలేదు. కాబట్టి వారు అందులో అబద్ధాలేం రాయలేదు. అతిశయోక్తులు రాయలేదు. ప్రతీవారి డైరీలోని సారాంశం ఎలాగైనా జీవించే ఉండాలని. మైఖేల్ జాక్సన్ నూట ఏభై ఏళ్ళు జీవించాలని ఆశించాడు. అందుకు ఎన్నో జాగ్రత్తలు తీసుకున్నాడు. నిత్యం డాక్టర్లు అతని ఆరోగ్యాన్ని పరీక్షించేవారు. ఐనా ఏభైయ్యో ఏట మరణించాడు" ఇలియా చెప్పింది.

"లెనిన్‌గ్రాడ్ ముట్టడి మీద చాలా పుస్తకాలు వచ్చాయి. నాన్ – ఫిక్షన్  కల్పనిక నవలలు, కథలు, సినిమాలు వచ్చాయి. వాటిలో ఆనాటి భయానక సంఘటనలని వాడుకున్నారు. నైన్టీన్ ఫార్టీ టులో లెనిన్ గ్రాడ్‌లో జనించిన పిల్లల్లోని ముప్పై రెండు శాతం మంది పిల్లలు మాల్‌న్యూట్రిషన్ వచ్చే వ్యాధులతో, నిమోనియాతో మరణించారు. ఐనా మనిషి నేర్చుకోలేదు. ఆ తర్వాత కూడా లెక్కలేనన్ని యుద్ధాలు జరిగాయి. జరుగుతున్నాయి. తాజాగా సిరియన్స్ అదే విషాదాన్ని అనుభవిస్తున్నారు. మరో విధంగా చెప్పాగా. మనిషి విషాదాలు బహుముఖాలు మా తాతగారు ఆ సమయంలో లెనిన్‌గ్రాడ్‌లో ఉన్నారు. ఆయన కుటుంబంలో ఒక్క మా నాన్నే జీవించారు."

అలెక్సీ తన మొబైల్లోని ఫోటోల్లోని ఓ ఫోటోని వెదికి చూపించి చెప్పాడు.

"ఇది మా తాత చేతిరాత. రష్యన్ భాషలో. నేను ఇంగ్లీష్‌లో చెప్తాను" అతను చెప్పాడు.

"18.7.1941 12 పి.ఎం. ఫెన్యా పోయింది.

28.12.1941 3 పి. ఎం. తాన్యా పోయింది.

13.4.1942 2 ఏ.ఎం. అంకుల్ వస్య పోయాడు.

10.5.1942 4 పి.ఎం. అంకుల్ లేషా.

13.5.1942 11 ఏ.ఎం తమ్ముడు లెక పోయాడు.

మా నాన్న తప్ప అంతా మరణించారు. మా నాన్న నైంటీన్ ఎయిటీ టులో పోయారు."

అంతా నిశ్శబ్దంగా ఉండిపోయారు.

"నీ చెల్లెలికి ఏమేం చూపిస్తున్నావు?" అలెక్సీ వాతావరణాన్ని తేలిక చేస్తూ అడిగాడు.

"నిన్న కేప్ కోస్ట్‌కి, కుకుం ఫారెస్ట్‌కి వెళ్ళాం."

"వెరీ నైస్. మా ఫ్రెండ్స్‌ని అక్కడికి తీసుకెళ్ళాం" ఇలియా చెప్పింది.

"సైమన్‌ని రమ్మంటే నమ్మలేని నిజం చెప్పాడు. ఎన్రికో వెహికల్లో వెళ్ళాం."

"నమ్మలేని నిజమా ఏమిటది?" ఇలియా వెంటనే అడిగింది.

"నాలుగు నెలల క్రితం పోయిన తన తాత కర్మకాండకి వెళ్తున్నానని. సైమన్ ఇలా అబద్ధాలు చెప్తాడని అనుకోలేదు."

"అది అబద్ధం కాదు" వెంటనే ఇలియా చెప్పింది.

"కాదా?" చైత్ర ఆశ్చర్యంగా అడిగింది.

"ఊహూ. బి.బి.సిలో దీని గురించిన ఓ ప్రోగ్రాం చూసాను. చాలా దేశాల్లో మనిషి మరణించిన కొద్దిరోజుల్లో శవాన్ని ఖననం చేస్తారు. ఘానాలోని కొన్ని తెగల్లో మరణించిన వెంటనే పాతిపెట్టడం పవిత్రంగా భావించేవారు. కాని పరిస్థితుల ప్రభావం వల్ల కొత్తగా ఓ విచిత్ర సంప్రదాయం ఆరంభమైంది. లిడియా అనుకుంటా ఆవిడ పేరు. తొంభై ఏళ్ళ ఆ వృద్ధురాలు మరణించిన మూడువారాలకి ఆవిడ దేహాన్ని ఖననం చేసారు. దాంతో ఆవిడమీద ఆవిడ కుటుంబానికి గౌరవంలేదని ఆరోపిస్తూ, ఆవిడని అంత త్వరగా పాతిపెట్టడం అపవిత్రంగా ఆ గ్రామస్థులు ఆరోపించారు. ఘానాలోని 'బర్త్ టు బరియల్' క్లిష్టమైందిగా మారింది. అందుకు నెలలు, ఒకోసారి సంవత్సరాలు పడుతుంది. అందువల్ల మార్చురీలో శవాలు గడ్డకట్టేలా చేసి భద్రపరుస్తారు."

ఆమె చెప్పేది చిత్రంగా ఉండటంతో అక్కా చెల్లెళ్ళు ఇద్దరూ ఆసక్తిగా వినసాగారు.

"వెంటనే పాతిపెట్టక పోవడానికి కారణం బంధువర్గం. జీవించి ఉండగా వారి పిల్లలు, భార్య, తల్లితండ్రులు వారి కుటుంబంగా భావిస్తారు. కాని మరణించాక కొన్ని పదుల సంవత్సరాలుగా మాటలులేని ఎక్స్‌టెండెడ్ ఫేమిలీలోని దూరపు బంధువులకి కూడా మరణించిన తమ బంధువుని ఎప్పుడు, ఎక్కడ, ఎలా పాతలో చెప్పే హక్కు ఉంటుంది. వారంతా ఆ విషయంలో తీసుకున్న నిర్ణయానికి మరణించినవారి కుటుంబం అంగీకరించాలన్నది ఇక్కడి సంప్రదాయం. ఘానా కాఫిన్ డిజైన్లు ప్రపంచ ప్రఖ్యాతి చెందాయి. అది ఎలా ఉండాలో కూడా వారి మధ్య ఏకాభిప్రాయం కుదిరితే కాని ఖననం జరగదు.

"సో వియర్డ్!" ఆద్య చెప్పింది.

"ఓ సందర్భంలో ఆరేళ్ళ క్రితం మరణించిన వ్యక్తి విషయంలో ఎవరు చీఫ్ మోర్నరో బంధువర్గం నిర్ణయించలేదు. కాబట్టి ఆ శవాన్ని రెఫ్రిజిరేటర్లో ఉంచారు. ఇలాంటివి ఘానాలో చాలా సాధారణమైపోయింది. పిల్లలు తమ తల్లితండ్రుల కర్మకాండ ఖర్చు భరించాలి. కాని శవాన్ని పాతిపెట్టే విషయంలో మాత్రం వారికి స్వతంత్రంలేదు. ఏభై ఏళ్ళ వైవాహిక జీవితానంతరం బంధువర్గ సభ్యుల సంఖ్య పెరుగుతుంది. దాంతో వారిమధ్య భిన్నాభిప్రాయాలు, వాదనలు కూడా. బందువుల్లోని లిస్ట్ ఆఫ్ మౌర్నర్స్ సరైన వరసక్రమంలో రాసుకోవడం పెద్ద తలనొప్పి. అందులో పోటీ ఉంటుంది. తనని తక్కువ చేసారని అవమానంగా ఫీలయ్యేవారు ఉంటారు. ముఖ్యమైన వారందరికీ ఫ్యూనరల్‌కి హాజరవడానికి ఆ రోజు తీరిక ఉండటం మరో సమస్య. ఏకాభిప్రాయం కుదిరి, ఖననం పూర్తయ్యేదాకా అదో పీడకల. మరణించిన వ్యక్తి కుటుంబానికే అన్ని నిర్ణయాలని వదలడం ఒకటే దారి. కాని ఆ మార్పు ఇంకా ఇక్కడ రాలేదు. ఘానా ప్రఖ్యాత పారిశ్రామిక వేత్త, రాజకీయ నాయకుడు ఎనభై నాలుగేళ్ళ నానా అకెన్‌టెన్ అపయ – మెంకా ఫ్యూనరల్ గురించి వార్త ప్రసారమైనప్పుడు ఇదంతా నాకు తెలిసింది. ఆ ఫ్యూనరల్ కి 226 పేజీల్లో రంగుల కాగితంలో నివాళులని సేకరించి, కలర్ ఫోటోలతో బ్రోషర్ తయారు చేయడానికి ఎంతకాలం పట్టి ఉంటుందో ఆలోచించండి" ఇలియా చెప్పింది.

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

**ప్రస్తుతం అందుబాటులో ఉన్న మల్లాదిగారి పుస్తకాల వివరాల కోసం ఇక్కడ క్లిక్ చేయండి**
www.anandbooks.com
www.telugubooks.in

Post your comments